బుధవారం । తెలంగాణ
27 మే 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

కామారెడ్డి జిల్లాలో ఒకే రోజు 43 మందికి కోర్టు శిక్షలు

- 8 మందికి జైలు, రూ 51,800 జరిమానా విధింపు
- ప్రమాదాలు విధి కాదు -- మన నిర్లక్ష్య ఫలితమే
- క్షణికానందం కోసం సేవించిన మద్యం..
- ఒకరి ప్రాణాన్ని తీస్తుంది,ఒక కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది
- కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర

కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 26 (నినాదం) :

కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తున్న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 43 మందికి న్యాయస్థానం జరిమానాలతో పాటు జైలు శిక్షలు విధించింది.ఇందులో 5 మందికి ఒక రోజు జైలు శిక్ష,3 మందికి రెండు రోజుల జైలు శిక్ష పడగా,అందరికీ కలిపి మొత్తం రూ.51,800 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "ప్రమాదాలు విధి కాదు – మన నిర్లక్ష్య ఫలితమే" అని స్పష్టం చేశారు. ఇంటి పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని,ఒక్కరి నిర్లక్ష్యం వల్ల ఆ కుటుంబం ఆర్థికంగా,మానసికంగా తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు."ప్రమాదం ముందస్తుగా చెప్పి రాదు" అనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలని సూచించారు. మద్యం మత్తులో స్టీరింగ్ పట్టడం అంటే ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని,క్షణికానందం కోసం చేసే తప్పు కుటుంబాలను చీకటిలోకి నెడుతుందని హెచ్చరించారు.మీ కుటుంబ క్షేమం కోసమైనా మద్యం సేవించి వాహనం నడపవద్దని,నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.

అండూర్ గ్రామంలో వైభవంగా మల్లన్న స్వామి జాతర

- మల్లన్న స్వామి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి
- కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్చెరు , మే26 (నినాదం)

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని అండూర్ గ్రామంలో శ్రీ మల్లన్న స్వామి జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ జాతరలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించడంలో జాతరలకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మికతకు మల్లన్న జాతర నిదర్శనమని తెలిపారు.

జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం

జమ్మికుంట, మే 26 (నినాదం)

కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న సీపీకి ఇన్స్పెక్టర్ రామకృష్ణ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపి స్థానిక పోలీసులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ పోలీసుల ప్రవేశపెట్టిన సిసిటిఎన్ఎస్ 2 ఓ టిఎస్ కాఫ్ ఈ సాక్ష్యం సైబర్ క్రైమ్ టూల్స్ బాడీ వార్న్ కెమెరాల వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్ పై సిబ్బంది పూర్తి పట్టు సాధించి రోజువారి వీధుల్లో వాటిని విరివిరిగా ఉపయోగించాలని ఆదేశించారు. స్టేషన్లోని రికార్డులను ఎఫ్ఐఆర్ ఇండెక్స్ ను పరిశీలించి కేసులను త్వరత గతిన పూర్తి చేయాలని సూచించారు. జమ్మికుంట పరిధిలోని గ్రామాలను సెక్టార్లు, సబ్-సెక్టార్లుగా విభజించి గ్రామ పోలీస్ అధికారులను కేటాయించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.పోలీస్ సిబ్బంది విధుల్లో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని.. రిసెప్షన్, పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట మార్కెట్ ను సందర్శించిన సీపీ

కరీంనగర్ సిపి గౌస్ ఆలం మంగళవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ను సందర్శించారు. మార్కెట్ లో ఏర్పాటుచేసిన మొక్కల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి కార్యదర్శి ఏ రాజా తదితరులు పాల్గొన్నారు.

భారతీయ జనతా పార్టీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నూతనంగా నియమితులైన డా. మల్గారి వైభవ్ రెడ్డి ని భాజపా చేవెళ్ల మున్సిపల్ శాఖ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించిన నాయకులు..

– చేవెళ్ళ, మే 26 (నినాదం):

జీవితంలో అన్నిటికంటే పెద్ద ఆస్తి విద్య

- చదువుతోపాటు సంస్కారం ముఖ్యం
- కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు, మే 26 (నినాదం):

మునుగోడు క్యాంపు కార్యాలయంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థులకు నగదు బహుమతి పురస్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి -లక్ష్మి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు,నగదు బహుమతి పురస్కారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, వ్యక్తి జీవితంలో అన్నిటికంటే పెద్ద ఆస్తి విద్య అని చదువుతోపాటు సంస్కారం ముఖ్యం అని అన్నారు.మేము చేసే ఈ సహాయంతో మీరు వృద్ధి చెంది ఎంతో మందికి సహాయపడాలని తెలిపారు.ఎవరికి ఎటువంటి సహాయం కావాలన్నా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ మీతో ఉంటుందని అన్నారు.ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులని బాగా చూసుకోవాలని సూచించారు.

మీడియాలో కార్పొరేట్ కళాశాల ర్యాంకులు కాదు మునుగోడు ప్రభుత్వ పాఠశాలల ర్యాంకులు చూడాలని తెలియజేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ,పేద విద్యార్థులకు సేవే చేసే అదృష్టం కల్గించిన భగవంతుడికి రుణపడి ఉంటానని అన్నారు.గ్రామాలలో తిరిగి ప్రభుత్వ బడుల పరిస్థితులను చూస్తే దారుణంగా ఉంది.కనీస వసతులు లేక విద్యార్థుల అవస్థలు అంతఇంత కాదు.వసతులను చూసి పేద విద్యారుల కోసం నియోజకవర్గాలలో ప్రోత్సాహ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించుకున్నానని, రానున్న రోజుల్లో విద్యకి వైద్యానికి ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని ప్రభుత్వన్ని డిమాండ్ చేస్తున్నని తెలిపారు.విద్య వైద్యం కోసం ప్రభుత్వం తో పోరాటం చేస్తానని, కమిషన్ల పేరుతో కాంట్రాక్టులను పెంచడం కాదు.పేద విద్యార్థులకు కోసం బడ్జెట్లు పెంచాలి. పోషకాలతో కూడిన ఆహారం లేక పిల్లలలో ఎదుగుదల లేదు.హాస్టల్స్ లో తిరుగుతుంటే నీళ్ళ చారు, నీళ్ళ పప్పు పెడుతున్నారు. మునుగోడు నియోజకవర్గంలో 18 హాస్టల్స్ ఉన్నవి ఎక్కడ కూడా మెరుగైన వసతులు లేవు.సొంత నిధులతో మర్రిగూడ లో కోట్ల రూపాయలు పెట్టి వసతులు ఏర్పాటు చేశాం.ప్రభుత్వం అన్ని వసతులు కల్పించాలాంటే ప్రభుత్వం దగ్గర నిధులు ఉండవు, మన శక్తి తో ఎంతో కొంత పేదవారికి సహాయం చేయాలి.ఇప్పటి వరకు 77 లక్షల 77 రూపాయలు ప్రోత్సాహకాలు అందించామనీ ఉన్నారు.ఫౌండేషన్ తో రెండు వేయిల మందికి కంటి ఆపరేషన్స్ చేయించాం, కోట్లు ఖర్చు పెట్టి ఓల్డ్ ఏజ్ హోం కట్టించం.కష్టపడే విద్యార్థులకు ఫౌండేషన్ అండగా ఉంటుంది.నిరుపేద కుటుంబాలలో చదువుకునే స్థోమత లేని విద్యార్థులకు ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆయన అన్నారు.రాష్ట్రం లో విద్యలో మునుగోడు నియోజకవర్గంల ముందుండేల కష్టపడాలి.సోషల్ మీడియాకు ఆకర్షితులై పిల్లలజీవితాలు చిత్తైపోతున్నాయి.తల్లిదండ్రులు పిల్లలని ఎప్పటిక ప్పుడు గమనిస్తూ కంటికిరెప్పలాగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాబందుల రాజ్యం మనకొద్దు

- నిరుపేదలను నిలువునా ముంచుతున్న బిజెపి సర్కార్
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మే 26 (నినాదం)

డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ కేంద్ర బిజెపి సర్కార్ మొదటి భోగిలో మోదీ రెండో భోగిలో ఆదాని అంబానీ లాంటి వారు ప్రయాణిస్తూ దేశాన్ని రాబందుల్లా పిక్కుతింటున్నారని, ఈ డబల్ ఇంజన్‌సర్కారుకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, డిసిసి అధ్యక్షుడు శివసేనారెడ్డి లు ఎద్దుల బండ్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై పెంచిన రేట్లు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గంటలు మోగిస్తే, చప్పట్లు కొట్టినంత మాత్రాన నిరుపేదల సమస్యలు తీరవని, ప్రజలకు అధిక భారం లేకుండా చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అధిక ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ నాయకులు వనపర్తిలో ధర్నాలు చేయడం సరికాదని, బాధ్యతాయుతంగా వ్యవహరించి మోదీ ఇంటి ముందల ధర్నాలు చేసి రాష్ట్రానికి ఏదైనా మేలు చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు. మాయ మాటలు చెప్పే అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ ఇప్పటికే మూడ పర్యాయాలు ఏడున్నర రూపాయలు పెట్రోల్ డీజిల్ పై పెంచిందని పేర్కొన్నారు. మోదీ సర్కార్ ఇంధనం ధరలను వెంటనే తగ్గించకపోతే జిల్లా, మండల, గ్రామ స్థాయిలోని పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి మెడలు వంచాల్సి వస్తుందని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు మంచి దోస్తాన్ మైంటైన్ చేస్తున్నాయని, వారి కార్యకలాపాలు నిరసిస్తూ మనం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దేశంలోని 19 రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వమే ఉందని, మరి ప్రజలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయడం లేదంటూ నిలదీశారు.వడ్ల కొనుగోలుపై నీతులు చెప్పే నాయకులు వడ్ల కష్టాలు పెంచడానికి మీరు పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు వాస్తవం కాదా అన్నారు. ఎఫ్ సి ఐ లకు, గోదాములకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోగా పైపెచ్చు ఇలాంటి మాటలు మాట్లాడడం సరికాదన్నారు.వారి నిరంకుష పాలనను నిరసిస్తూ అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి నరేంద్ర మోడీ సర్కార్ ను ముట్టడించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి అనే ఇంజన్ ప్రభుత్వాన్ని కొనసాగిస్తుందని, రానున్న రోజుల్లో కేంద్రంలోనూ రాహుల్ గాంధీ మరో ఇంజన్ గా మారతారని, ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, వనపర్తి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రోహిణి కార్తె ఆరంభంతో
రోళ్ళు బద్దలవుతున్న ఉష్ణోగ్రతలు

- మండిపోతున్న సింగరేణి ఉపరితల గనులు
- మృత్యువాత పడుతున్న మూగ జీవాలు, పక్షులు

మణుగూరు మే 26 (నినాదం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో వాతావరణం రోజుకి అగ్ని గోళంగా మండిపోతుంది. రోహిణి కార్తె ఆరంభంతో రోజువారి ఉష్ణోగ్రతలు 46 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలతో రోళ్ళు బద్దలవుతున్నాయి. దీంతో గాలిలో తేమ 25 శాతం పడిపోవడంతో పొడి వాతావరణం తో మానవ జీవం అతలాకుతలమైపోతుంది. మణుగూరు మండలంలో ఉన్న సింగరేణి ఉపరితల గనులు అధిక ఉష్ణోగ్రతకి మండిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతతో ఉపరితల గనుల్లో బొగ్గు పులుసు వాయు వెదజల్లుతూ నివ్వులు కక్కుతుంది. మణుగూరు కి చెంతనే ఉన్న ఉపనదిగా ఉన్న గోదావరిలో నీరు పూర్తిగా అడుగంటిపోయింది. దీంతో చుట్టుపక్క ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఎండిపోవడంతో త్రాగునీరు ఎద్దడి ఏర్పడి ప్రజలు అల్లాడిపోతున్నారు. అసలే వేసవికాలం కావడంతో గిరిజనులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణకు వెళ్లే కార్మికులు మృత వాతపడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి భానుడు భగభగలాడిపోవడంతో ప్రధాన వీధుల్లో జనసంచారం లేక బోసిపోతున్నాయి. వాతావరణ శాఖ ఐఎండి ప్రకటించిన దాని ప్రకారం రోజువారి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు పూర్తి జాగ్రత్తలు పాటించాలని అధికారులు వెల్లడిస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రజల అప్రమత్తంగా ఉంటూ, ఎండగా ఉండే ప్రాంతాల్లో తిరగకుండా ఉండే విధంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. ప్రజలు వడదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి అరగంటకు ఒకసారి దాహం అయినా కాకపోయినా చల్లటి నీళ్లు త్రాగుతూ, కొబ్బరినీళ్లు, శీతల పానీయాలను సేకరిస్తూ ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మణుగూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సింగరేణి ఉపరితల గనులు మండిపోవటంతో వేడి గాలిలో మిళితమై తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. అలాగే పక్కనే భద్రాద్రి పవర్ ప్లాంట్ ద్వారా విడుదలయ్యే కాలుష్యం తో మరింత ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో ఉన్న వన్యమృగాలకు త్రాగునీరు లభించగా చుట్టుపక్కల గ్రామాల్లోకి వస్తు వన్యప్రాణులు మృతవాసి పడుతున్నాయి. గాలిలో సంచరించే పక్షులు సైతం అధిక ఉష్ణోగ్రతకు మృత వాత పడుతున్నాయి. దీంతో పిల్లలు వృద్ధులు తీవ్రంగా వీచే వడ గాల్పులకు అస్వస్థతకు గురవుతున్నారు. చాలామంది పిల్లలు వాంతులు విరేచనాలతో వైద్యశాలలో చికిత్స పొందుతూ ప్రమాద పరిస్థితికి చేరుకుంటున్నారు. ఈనెల 27 వరకు తీవ్రమైన ఉడగాల్పులు వీచే అవకాశం ఉందని ఐఎండి వాతావరణ శాఖ స్పష్టమైన సమాచారాన్ని అందించింది. దీనికి తోడు రోహిణి కార్తె ప్రారంభమై రోడ్లు బద్దలై ఎండలతో మణుగూరు ప్రాంతం తల్లడిల్లి పోతుంది. సింగరేణి సంస్థలో విధులు నిర్వహించే కార్మికులు ప్రాణాల అరిచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గోదావరి నది ఎడారిలాగా మారిపోయింది. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే మరణాలు సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు.